andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.7। కనిష్ఠం 26.8



ఘనంగా భీమన్న పండుగ

కుంటాల, జూన్16: మండల కేంద్రంలో కుంటాలలో ఆదివారం భీమన్న పండుగను ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో భీమన్న దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం నుంచి భీమన్న ఆలయం వరకు అధిక సంఖ్యలో గ్రామస్తులు బాజా భజంత్రిలతో వెళ్లి భీమన్న దేవునికి ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పించి వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు మచ్చ మారుతి, గణేష్, నరు, చందు, గంగారాం, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.





● రోడ్డు సౌకర్యం లేక కడెం వాగులోంచి నడిచి వెళ్తున్న పెంబి మండల మారుమూల గ్రామాల ప్రజలు (ఫైల్)



● వాగును దాటే క్రమంలో కొట్టుకుపోయి చెట్టును పట్టుకొని రాత్రంతా వాగులోనే గడిపి ఇస్లాంపూర్ గ్రామస్థుడు (ఫైల్)



● వరద ఉధృతికి కొట్టుకుపోయిన పసుపుల వద్ద నిర్మించిన వంతెన (ఫైల్)

దారి లేక తిప్పలు!

» ఖానాపూర్, కడెం, పెంబి మండలాల్లో రోడ్లు, వంతెనల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు కరువు
» ప్రతీ వర్షాకాలం జల దిగ్బంధంలోకి పలు గ్రామాలు » వాగులు ఉప్పొంగితే బయట ప్రపంచానికి రోజుల తరబడిగా దూరమే..
» ప్రభుత్వాలు, పాలకులు మారినా తమ రాత మారడం లేదంటూ అడవి బిడ్డల ఆవేదన » అండర్ పాస్‌లు నిర్మిస్తామంటేనే 7 రోడ్లకు అనుమతిస్తామంటున్న అటవీ శాఖ
» ఎంపీ, ఎమ్మెల్యేలు చొరవ తీసుకుంటే తమ దారి తిప్పలు తప్పుతాయని స్థానికుల ఆశాభావం

ప్రతీ వానాకాలం ఇబ్బంది పడుతున్నాం..

● భారతిబాయి, చాకిరేవు గ్రామం, పెంబి మండలం



పెంబి నుంచి మా గ్రామానికి వచ్చే దారిలో వాగులు, ఒర్రెలు ఉన్నాయి. వానాకాలం వచ్చిందంటే వాగులను దాటి బయటికి వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. ఎవరికైనా ఆరోగ్యం బాగా లేకున్నా ఏదైనా అత్యవసర పరిస్థితి వచ్చినా అంతే సంగతులు. ప్రతీ ఏడాది ఇబ్బంది పడుతున్నాం. మా గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి.

ఖానాపూర్, జూన్ 16: ప్రతీ యేడు వర్షాకాలం బయట ప్రపంచానికి రోజుల తరబడిగా ఆ గ్రామాల ప్రజలు దూరంగా బతుకుతున్నాయి. దశాబ్దాల కాలం నుంచి తమదారి సమస్యకు పరిష్కరం చూపే పాలకులు దొరకక అడవి బిడ్డలు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రతీ ఏడాది వర్షాలు కురిసి వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడంతో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తూరాబాద్ మండలాలలోని అనేక గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. ఆ గ్రామాలకు రోడ్డు సౌకర్యాన్ని కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారనే విమర్శలను మూటగట్టుకుంటున్నారు. దశాబ్దాలుగా తమసమస్య పరిష్కారమవుతుందని ఎదురుచూస్తున్న మారుమూల గ్రామాల ప్రజలకు ప్రతీయేడు నిరాశే ఎదురవుతోంది.

● దశాబ్దాలుగా ప్రతీయేడు రోజుల తరబడి జలదిగ్బంధంలోనే..

ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్ మండలాల్లోని పలుమారుమూల గ్రామాలు దశాబ్దాలుగా ప్రతీ ఏడాది వర్షాకాలంలో జలదిగ్బంధంలోనే మగ్గిపోతున్నాయి. పెంబి మండలంలోని దొత్తివాగు, కడెం వాగు ఉప్పొంగి ప్రవహిస్తే పసుపుల, దోందారి, వస్‌పెల్లి, శెట్‌పెల్లి, యాపల్‌గూడ, రాంనగర్, సత్తుగూడ, గుమ్మెన, ఎంగ్లాపూర్, తులసిపేట్, చాకిరేవు, అంకెన, రాయదారి, హరిచంద్ తండా లాంటి మరిన్ని గ్రామాలు బయట ప్రపంచానికి రాలేక రోజుల తరబడి జలదిగ్బంధంలోనే ఉండిపోవాల్సి వస్తోందని మండలవాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కడెం మండలంలో గంగాపూర్, బాబానాయక్‌తండా, లక్ష్మీపూర్, దేవునిగూడెం, అల్లంపెల్లి, అద్దాల తిమ్మాపూర్, గుర్రం మధిర, చింతగూడ, గంగానాయక్ తండా, ఇస్లాంపూర్ గ్రామాలు వాగులు ఒర్రెలుఉప్పొంగి ప్రవహిస్తే ఊరి నుంచి బయటకు వెళ్లేందుకు రోజుల తరబడి వేచిఉండాల్సిన పరిస్థితి నెలకొంటుంది. అత్యవసర పరిస్థితుల్లో తెగించి బయటకు వెళ్తే ఉప్పొంగి ప్రవహిస్తున్న నీటిలో ఎంతోమంది ప్రవాహంలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామాలతోపాటు ఖానాపూర్, దస్తురాబాద్ మండలాల్లో సైతం భారీవర్షాలకు పల్కేరివాగు, రెంకోని వాగులాంటి ఎన్నోవాగులు, ఒర్రెలు ఉప్పొంగి రోజుల తరబడిగా రాకపోకల కు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

● అండర్ పాసులు నిర్మించాలని ఏడు రోడ్లకు అటవీశాఖ మెలిక

కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో గల ఖానాపూర్ ప్రాంతంలో రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు అడ్డుగా మారుతున్నాయి. 2019 నుంచి ఇప్పటి వరకు పలుమార్లు ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల్లో పలురోడ్ల నిర్మాణం కోసం అటవీశాఖ అనుమతుల కోసం నేషనల్ వైల్డ్ లైఫ్‌కి ప్రతిపాదనలు పంపినట్లు పంచాయతీరాజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈప్రతిపాదనపై స్పందించిన నేషనల్ వైల్డ్ లైఫ్ విభాగం అడవి ప్రాంతాల్లో నిర్మించే రోడ్లపై పలుచోట్ల వన్యప్రాణులు యథేచ్ఛగా రోడ్డు దాటేందుకు వీలుగా అండర్‌పాస్‌ల నిర్మాణం చేయాలని సూచించింది. దీంతో నాలుగు మండలాల్లోని ఏడు రోడ్లు ఇప్పటివరకు అనుమతులకు నోచుకోవడం లేదని అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో మొదటిది కడెం మండలంలోని ఆర్‌అండ్‌బీరోడ్డు నుంచి అల్లంపల్లి వరకు నిర్మించే రహదారిపై 23చోట్ల అండర్‌పాస్‌ల నిర్మాణం చేయాలని సూచించింది. రెండోది ఖానాపూర్ మండలంలోని ఎర్వచింతల్ నుంచి కడెం మండలంలోని దత్తోజిపేట్ వరకు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపిన రోడ్డుపై ఆరుచోట్ల అండర్‌పాస్‌ల నిర్మాణం చేయాలని అటవీశాఖ సూచించింది. మూడోది దస్తురాబాద్ నుంచి గోండుగూడకు వెళ్లే రోడ్డు నిర్మాణానికి సైతం అటవీశాఖ అనుమతులు లభించలేదని పంచాయతీరాజ్ అధికారులు చెబుతున్నారు. నాల్గోది పెంబి మండలంలోని రాసిమెట్ల నుండి కోర్కల్ గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి అటవీశాఖకు ప్రతిపాదనలు పంపగా ఈ రోడ్డుపై 12 చోట్ల అండర్‌పాసుల నిర్మాణం చేయాలని సూచించింది. ఐదోది పెంబి మండలంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి కోసగుట్ట వరకు రోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపగా ఈ రోడ్డుపై ఆరుచోట్ల అండర్‌పాస్‌ల నిర్మాణం చేయాలని సూచించింది. ఆరోది కడెం మండలంలోని మాసాయిపేట్ నుంచి అక్కకొండ నరసింహస్వామి ఆలయం వరకు నిర్మించనున్న రోడ్డుకు అటవీశాఖ అనుమతులు మంజూరు చేయలేదని పంచాయతీరాజ్ అధికారులు చెబుతున్నారు. ఏడోది కడెం మండలంలోని ధర్మాజీపేట్ నుంచి లక్ష్మీసాగర్ తండా వరకు రోడ్డు నిర్మించేందుకు అటవీశాఖకు ప్రతిపాదనలు పంపించగా ఈ రోడ్డుకు సైతం అనుమతులు ఇవ్వలేదని పంచాయతీ రాజ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

● భారంగా అండర్‌పాస్‌ల నిర్మాణం

ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్ మండలాల్లో ఏడు రోడ్ల నిర్మాణం కోసం అటవీశాఖకు పంచాయతీరాజ్‌శాఖ ప్రతిపాదనలు పంపిన నేపథ్యంలో నేషనల్ వైల్డ్ లైఫ్ నుంచి పంచాయతీరాజ్ శాఖకు ఈ రోడ్ల నిర్మాణం చేసే సమయంలో వన్యప్రాణుల రాకపోకలకు అనుకూలంగా అండర్‌పాస్‌ల నిర్మాణం చేయాలని సూచనలు చేసింది. ఇది బాగున్నా అండర్ పాస్‌ల నిర్మాణమే ప్రస్తుతం ఈ రోడ్ల నిర్మాణానికి అడ్డుగా మారుతున్నాయని అధికారులు చెబుతున్నారు. రోడ్డు నిర్మాణ వ్యయానికి పదింతలు అధికంగా నిధులు అండర్‌పాస్‌ల నిర్మాణం కోసం వెచ్చించాల్సి వస్తుందని చెబుతున్నారు. నేషనల్ వైల్డ్ లైఫ్ సూచనల మేరకు అండర్ పాస్‌ల నిర్మాణం కోసం నిధులను మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి పంచాయతీ రాజ్‌శాఖ ప్రతిపాదనలు పంపినా ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి క్లియరెన్స్ రాలేదని చెబుతున్నారు.

● ఎంపీ, ఎమ్మెల్యేల పైనే ఆశలు

అండర్‌పాస్‌ల నిర్మాణం కోసం వెచ్చించాల్సిన నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు కావాలంటే స్థానిక ప్రజాప్రతినిధులు బలంగా ప్రయత్నాలు చేయాల్సిందేనని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఖానాపూర్ నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న వెడ్మ బొజ్జు సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడుగా పేరుంది. స్థానిక సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి టైగర్ జోన్ పరిధిలోని గ్రామాలకు రోడ్లను నిర్మించేందుకు నిధులను మంజూరు చేయించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అలాగే ఎంపీగా గోడం నగేష్ టైగర్‌జోన్ గ్రామాల రాకపోకలకు రోడ్ల నిర్మాణం కోసం అటవీశాఖలోని వైల్డ్ లైఫ్ విభాగం పెట్టిన మెలికపై కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రోడ్లను మంజూరు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

అండర్ పాస్‌ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాం

● శంకరయ్య, ఈఈ, పంచాయతీరాజ్ శాఖ



ఖానాపూర్, కడెం, దస్తురాబాద్, పెంబి 4 మండలాల్లో 7 రోడ్ల నిర్మాణం కోసం అటవీశాఖ అనుమతులుకోరుతూ ప్రతిపాదనలు పంపితే నేషనల్ వైల్డ్ లైఫ్ విభాగం పలుచోట్ల అండర్ పాస్‌ల నిర్మాణం చేయాలని సూచించింది. నిర్మాణం కోసం భారీగా నిధులు అవసరం ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

అడెల్లి పోచమ్మకు ప్రత్యేక పూజలు

సారంగాపూర్, జూన్16: మండలంలోని అడెల్లి పోచమ్మ దేవాలయంలో ఆదివారం భక్తులు పోచమ్మ తల్లి దీవించు తల్లి అంటూ ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల నుండే కాకుండా మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై నైవేద్యం సమర్పించారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులను పడకుండా ఆలయ చైర్మన్ ఐటీ చందు, ఆలయ ఇన్‌చార్జి ఈవో రంగు రవికిషన్ గౌడ్‌లు అన్ని ఏర్పాట్లను చేశారు.

● గ్రామ దేవతలకు పూజలు

మండల కేంద్రంతోపాటు బీరవెల్లి, కౌట్ల, జాం, ధని గ్రామాలతోపాటు తదితర గ్రామాల్లో గ్రామ దేవతలకు పూజలు చేసి సుఖసంతోషాలతో ఉండాలని దేవతలను వేడుకున్నారు. అనంతరం మొక్కులను మొక్కారు.

● పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

మండలంలోగల అడెల్లి మహా పోచమ్మ ఆలయంలో ఆదివారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి శ్రీనివాస్ అమ్మవారికి హారతినిచ్చి పూజలు చేశారు. అనంతరం ఆయనను ఆలయ సిబ్బంది సన్మానించింది.

'జీరో విద్యుత్ బిల్ రానివారు దరఖాస్తు చేసుకోవాలి'

లక్ష్మణచాంద, జూన్ 16: 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగం కలిగి ఉండి జీరో విద్యుత్ బిల్ రాని వారంతా ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రాంప్రసాద్ కోరారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగిసినందున దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుందని 200 యూనిట్ల విద్యుత్ వినియోగం ఉండి జీరో బిల్లులు రానివారు తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కరెంట్ బిల్లు రశీదు, ప్రజాపాలన దరఖాస్తు రశీదు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ ప్రతులను, ఫోన్ నంబర్ వివరాలను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

కరెంట్‌షాక్‌తో గేదె మృతి

కుంటాల, జూన్16: మండలంలోని ఓలాలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి ఓ మూగజీవి బలైంది. ఓలా శివారులో కొద్దిరోజుల క్రితం ఈదురు గాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. అధికారులు విరిగిన చోట కొత్త స్తంభాలు ఏర్పాటుచేసి వైర్లను పునరుద్ధరించలేదు. విద్యుత్ వైర్లకు సరఫరాను సైతం నిలిపివేయడం మర్చిపోయారు. ఈ నేపథ్యంలో తగిలి గ్రామానికి చెందిన సయ్యద్ ఖరీంకు చెందిన గేదె ఆదివారం మేతకు వెళ్లి గేదె విద్యుత్ తీగకు తగిలి మృతిచెందింది. విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంతో తన గేదె మృతి చెందిందని బాధిత రైతు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గేదె విలువ 80వేలు ఉంటుందని పేర్కొంటున్నారు.

ప్రతీ సోమవారం ప్రజావాణి

● ట్రాన్స్‌కో ఏఈఈ శివ ప్రసాద్

కుంటాల, జూన్, 16: ప్రతి సోమవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కల్లూరు సెక్షన్ ఆఫీసులో ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శివ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఆయా గ్రామాల ప్రజలు, రైతులు ఏవైనా విద్యుత్ సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చునని, సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

బాసరకు పోటెత్తిన భక్తులు

● అమ్మవారి దర్శనానికి మూడు గంటలకు పైగా క్యూ.. ● తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొన్న భక్తులు

బాసర, జూన్ 16: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఆదివారం సెలవు కావడం, ఏకాదశి పర్వదినం కావడంతో అక్షర శ్రీకారం జరిపించేందుకు భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచే ఆలయంలోని క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. అమ్మవారి దర్శనం, అక్షర శ్రీకార పూజల కోసం భక్తులు క్యూలైన్లలో మూడు గంటలకుపైగా వేచి చూడాల్సి వచ్చింది. దినమంతా అమ్మవారి నిలయం భక్తులతో కిక్కిరిసి కనిపించింది.



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

● భక్తులకు ఇక్కట్లు..

అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు అసౌకర్యాలతో ఇబ్బంది పడ్డారు. ఒకవైపు ఎండవేడిమి, మరోవైపు వసతులు సరిపోక చిన్నారులు, వృద్ధులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. కనీసం తాగునీరు అందక భక్తులు విలవిల్లాడారు. భక్తుల రద్దీ పెరగడంతో ఆలయ అధికారులు చేపట్టిన చర్యలు ఏ మాత్రం సరిపోలేదు.

● 'మహా' అక్షర శ్రీకార పూజలు

మహారాష్ట్రలోని శ్రీ స్వామి సమర్థ గురుపీఠం ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు భారీగా జరిగాయి. మహారాష్ట్రకు చెందిన ఈ గురుజీ రెండు రోజుల పాటు అమ్మవారి క్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర నుంచి ముంబాయి, సోలాపూర్, నాసిక్, పర్బనీ వంటి సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి గురుజీ నిర్వహించిన కార్యక్రమంలో తమ పిల్లలకు అక్షర శ్రీకార పూజలు జరిపించుకున్నారు. సోమవారం కూడా ఈ కార్యక్రమం కొనసాగనుంది.



ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు



ప్రత్యేక అక్షర శ్రీకార పూజల కార్యక్రమంలో చిన్నారులు



సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ శ్రీనివాస్

చెక్‌పోస్ట్‌ల వద్ద అప్రమత్తంగా ఉండాలి: సీఐ

దిలావర్‌పూర్, జూన్16: పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్ట్‌ల వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉండాలని నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్ సూచించారు. ఆదివారం దిలావర్‌పూర్ టోల్‌ప్లాజా వద్ద పోలీస్ చెక్‌పోస్ట్‌ను సీఐ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ పోలీసులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా మిట్ట మధ్యాహ్నం, లేదంటే అర్ధ రాత్రి వేళ పశువులను అక్రమ రవాణా చేసే అవకాశ ముందన్నారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశాకే వదలాలన్నారు. ఆవులను అక్రమంగా తరలించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకోవాలన్నారు. చట్ట వ్యతిరేకంగా పశువులను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

● నేడు ఈదుల్ జుహా వేడుకలు ● ముస్తాబైన ఈద్గాలు, ప్రార్థన స్థలాలు



భైంసాలో ప్రార్థన కోసం ముస్తాబైన ఈద్గా

భైంసా, జూన్16: ముస్లింలు త్యాగానికి ప్రతిరూపంగా భావిస్తూ నిర్వహించుకునే బక్రీద్ పండుగ కోసం జిల్లాలోని ఈద్గాలు, ప్రార్థన స్థలాలు ముస్తాబయ్యాయి. సోమవారం నిర్వహింపబడే పర్వదిన వేడుకల ప్రత్యేక ప్రార్థనల కొరకు గాను ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహమ్మద్ ప్రవక్తకు ముందు ఖలీలుల్లా అనే మహానీయుడుండేవారని, ఆయన దేవుడి ఆజ్ఞ మేరకు చాలా కాలానికి జన్మించిన తన కుమారుడిని పరోపకారం కోసం బలి ఇవ్వడానికి సిద్ధపడినాడన్నది ఖురాన్ కథనం. దయా స్వరూపుడైన భగవంతుడు ఆయన కుమారుడికి బదులుగా గొర్రె పిల్లను బలిఇస్తే సరిపోతుందని సెలవివ్వగా ఆనాటి నుంచి బక్రీద్ పర్వదినాన్ని ఖలీలుల్లా త్యాగ నిరతికి గుర్తుగా పవిత్ర ఖుర్బానీ కార్యక్రమాన్ని తప్పకుండా పాటిస్తున్నారు.

● నేడు సామూహిక ప్రార్థనలు

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈద్గాలు, ప్రార్థన స్థలాలు, మసీదుల వద్ద వద్ద సామూహిక ప్రార్థనలను నిర్వహిస్తున్నట్లు జిల్లాలోని ఆయా ప్రాంతాల మత పెద్దలు తెలియజేశారు. త్యాగ నిరతికి ప్రతిరూపంగా నిలిచే బక్రీద్ పండుగను శాంతియుత వాతవరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. బక్రీద్ పర్వదిన వేడుకలను పురస్కరించుకొని జిల్లాలోని ప్రధాన ప్రాంతాల మసీదుల వద్ద ప్రార్థనలతో కోలాహలం కనపడింది. ప్రార్థనల కోసం వచ్చే వారితో మసీదులు కిటకిటలాడాయి. ముఖ్యంగా మాంసాహార దుకాణాల వద్ద విపరీతంగా సందడి నెలకొంది.

● కొనుగోళ్లతో సందడి


పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకునేందుకు ముస్లింలు జరిపిన వివిధ కోనుగోళ్లతో ఆది వారం మార్కెట్ సందడిగా కనిపించింది. ప్రధానంగా సేమియా విక్రయ కేంద్రాలు, బట్టల దుకాణాలు, జనరల్ స్టోర్స్ మహిళల కొనుగోళ్లతో కళకళలాడాయి. రోడ్లపై వెలిసిన సెమియా, పాలకేంద్రాల వద్దకు అధిక సంఖ్యలో తరలివచ్చి కొనుగోళ్లు చేపట్టారు.

● భారీ పోలీసు బందోబస్తు

బక్రీద్ పర్వదిన వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు గాను ప్రశాంత వాతావరణంలో పూర్తిచేసేందుకు పోలీసుశాఖ ముందస్తు భారీ పోలీసు బందోబస్తు చర్యలు చేపట్టింది. భైంసాలో ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ నేతృత్వంలో టౌన్ సీఐ రాజారెడ్డి బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. పట్టణంలో పర్వదినాన్ని పురస్కరించుకొని 8 పికెట్లు ఏర్పాటుచేశారు. మూడు పెట్రోలింగ్ టీంలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో పాటు సిబ్బంది బందోబస్తు కోసం గాను తరలివచ్చారు. వీరితో పాటుగా ప్రత్యేక పోలీసు బలగాలు తరలివచ్చాయి.



కొనుగోలు కేంద్రాల వద్ద నెలకొన్న సందడి


ప్రత్యేక ప్రార్థనల కోసం సిద్ధమైన ఈద్గా మైదానం

బక్రీద్‌కు ముమ్మర ఏర్పాట్లు



ఆదిలాబాద్‌అర్బన్, జూన్ 16: బక్రీద్ పండుగ నేపథ్యంలో ప్రార్థనల సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ శాఖ తరపున పూర్తి చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని ఈద్గా మైదానంలో అన్ని ఏర్పాట్లు చేపడుతు న్నారు. సోమవారం ముస్లిం సోదరులు ఈద్గా మైదానంలో నమాజ్ ఆచరించనున్న నేపథ్యంలో మైదానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మైకులు ఏర్పాటు చేయడంతో పాటు ఈద్గా మైదానం శుభ్రం చేసి కార్పెట్లు పరుస్తున్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ఖానాపూర్, జూన్16: కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఎమ్మెల్యే బొజ్జుపుట్టిన రోజు సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో 30మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. ప్రస్తుత సమాజంలో రక్తదానానికి ఉన్న ఆవశ్యకతను గుర్తించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు దొనికెని దయానంద్ తెలిపారు. మండలంలోని మస్కాపూర్ రామాలయంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేర్వేరు కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ సత్యం, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు తోట సత్యం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడార్ల గంగ నర్సయ్య, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గొర్రె గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, జిల్లా నాయకులు లక్ష్మీపతి గౌడ్, జన్నారపు శంకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ అంకం రాజేందర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఆకుల వెంకా గౌడ్, మాజీ సర్పంచ్‌లు నేరెళ్ల సత్యనారాయణ, సుతారి రాజేశ్వర్, అమానుల్లా ఖాన్, ఒక్కశెట్టి కిషోర్, సార్ల నర్సయ్య, పోలంపల్లి సచిన్, ఎలుముల శోభన్ బాబు, సలీం ఖాన్, నహీం ఖాన్, జహీర్, తదితరులున్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- విదేశాలకు భారీ వాహనాల ఎగుమతి
- అదుపులోకి తీసుకున్న వరంగల్ పోలీసులు
- 70 లక్షల విలువైన ఐదు కార్లు స్వాధీనం

మట్టెవాడ, జూన్ 16: ఫైనాన్షియర్ల ముసుగులో కార్లు, టిప్పర్లు, జేసీబీ వంటి భారీ వాహనాలను మోసపూరితంగా కొనుగోలు చేసి నెదర్లాండ్, దక్షిణాఫ్రికా, కాంబోడియా వంటి దేశాలకు విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి తెలిపారు. ఆదివారం వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తురకలకుంట గ్రామానికి చెందిన వరికుప్పల దశరథ్, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం వసంతనగర్ చిన్నదుర్గం నందాన్, రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం జగద్గిరిగుట్టకు చెందిన కొశెట్టి రాకేశ్, హైదరాబాద్ సంతోష్‌నగర్ ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జాబీర్‌లు ఈ దందాకు తెరలేపారన్నారు. వీరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో... ఆర్థిక ఇబ్బందుల కారణంగా భారీ వాహనాలు అమ్మకానికి పెట్టుకున్న కొంతమంది యజమానుల నుంచి వాహనాలు కొనుగోలు చేసేవారని చెప్పారు. వాటికి సంబంధించిన ఈఎంఐలు తామే కడతామని నమ్మించేవారన్నారు. అలా కొన్న వాహనాలను ఇతరులకు విక్రయించడమో లేక స్క్రాప్ కింద అమ్మడమో చేసేవారని వివరించారు. అలాగే ముంబాయిలోని కొన్ని బృందాల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేవారని డీసీపీ వెల్లడించారు. ముఠా సభ్యులు గతంలో హైదరాబాద్ పోలీసులకు పట్టుబడి సుమారు 16 నెలలు జైలుకు వెళ్లారని, విడుదలయ్యాక కూడా అదే తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. 2023లో వరంగల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సుమారు నాలుగున్నర కోట్ల విలువైన వాహనాలను మోసపూరితంగా తీసుకొని నెదర్లాండ్, సౌతాఆఫ్రికా, కాంబోడియా లాంటి దేశాలకు ఎగుమతి చేశారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వరంగల్ హనుమాన్‌జంక్షన్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకొని, 5 కార్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

'నాలా' ఎలా?



(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాలి. ధరణి రాక ముందు ఆర్డీవో స్థాయిలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేస్తూ నాలా చార్జీలు వసూలు చేసే వారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో భూముల విలువ ఆధారంగా 5శాతం, జీహెచ్ఎంసీ పరిధిలో 9శాతం చొప్పున తీసుకునేవారు. కానీ, తెలంగాణ ఏర్పాటు తర్వాత ధరణిని తీసుకొచ్చిన అప్పటి ప్రభుత్వం.. నాలా చార్జీలు చెల్లించేందుకు తొలుత ఆప్షన్ ఇవ్వలేదు. ఆ తర్వాత ఇచ్చినా.. ధరణిలో నమోదై ఉండి, ఎకరాలు, గుంటల చొప్పున నమోదై ఉన్న భూములకు మాత్రమే అవకాశం కల్పించింది. అనధికార లేఅవుటల్లో గజాల చొప్పున ఓపెన్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అలాంటి ఆప్షన్ లేకుండా పోయింది. ఉదాహరణకు ఒక ఊరి శివారులో వ్యవసాయ భూమి ఉంటే.. ధరణిలో అది ఫలానా సర్వే నంబర్‌లో ఉందని పేర్కొంటూ దాని విస్తీర్ణం ఎకరాలు, గుంటల్లో ఉంటుంది. ప్రస్తుతం ఇలాంటి భూమిని మాత్రమే వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకునే వీలుంది. గతంలోనే లేఅవుట్‌గా మార్చి, సదరు భూమిని గజాల చొప్పున వేర్వేరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి ఉంటే.. ధరణిలో అది హౌసింగ్ సైట్ అనే పేరుతో చూపిస్తోంది. ఇలాంటి భూమికి నాలా చార్జీలు చెల్లించే అవకాశం లేకుండా పోయింది. దీంతో దశాబ్దాల క్రితం భూములు కొనుగోలు చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆప్షన్ లేక సతమతం..

గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాల్లో దశాబ్దాల క్రితమే పెద్దఎత్తున అనధికార లేఅవుట్లు వెలిశాయి. వాటిలో ఓపెన్ ప్లాట్లను వేలాది మంది కొనుగోలు చేశారు. ఆయా స్థలాల్లో భవన నిర్మాణ అనుమతులకు వెళ్లిన సందర్భంలో భూమి విలువలో ఎల్ఆర్ఎస్ చార్జీల కింద 30శాతం, నాలా చార్జీల కింద మరికొంత వసూలు చేసే వారు. దీనికితోడు జీహెచ్ఎంసీ పరిధిలోనైతే చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) పేరిట చార్జీలు తీసుకునేవారు. అయితే, తెలంగాణ ఏర్పాటు తర్వాత హెచ్ఎండీఏలో భవన నిర్మాణ అనుమతుల కోసం వెళ్లినప్పుడు కేవలం ఎల్ఆర్ఎస్ చార్జీలు మాత్రమే తీసుకుంటున్నారు. సదరు స్థలానికి నాలా చార్జీలు చెల్లించకపోతే.. ఆ ఫీజు చెల్లించి పత్రాన్ని తీసుకురావాలని సూచిస్తున్నారు. ధరణి వచ్చిన తర్వాత గుంటలు, ఎకరాల్లో ఉన్న భూముల కన్వర్షన్‌కు మాత్రమే ఆప్షన్ ఇచ్చిన ప్రభుత్వం... గజాల్లో ఉన్న స్థలాలకు సంబంధించిన ఆప్షన్ ఇవ్వకపోవడంతో చిన్న, మధ్య తరహా డెవలపర్లు, బిల్డర్లు తీవ్రంగా సతమతమవుతున్నారు. ఈ విషయమై గత ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ల ప్రతినిధులు అనేక మార్లు సంప్రదించినా.. ఫలితం దక్కలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి.. గజాల్లో ఉన్న స్థలాలకూ నాలా చార్జీలు తీసుకొని, భవన నిర్మాణ అనుమతులు ఇప్పించాలని వారు కోరుతున్నారు. దీన్ని అమలు చేస్తే ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లకుపైగా ఆదాయం వస్తుందని పేర్కొంటున్నారు.

సమస్యను పరిష్కరించాలి

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని అనధికార లేఅవుట్లలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు పదేళ్లుగా పలువురు డెవలపర్లు, బిల్డర్లు ప్రయత్నం చేస్తున్నారు. కానీ అనుమతులు రాకపోవడంతో ఆయా స్థలాలన్నీ నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వంలో ధరణి తీసుకొచ్చి అదనపు చార్జీలను విధించి ఆదాయాన్ని పొందేందుకు రకరకాల మార్గాలను అప్పటి అధికారులు అన్వేషించారు. కానీ, ఆదాయం వచ్చే మార్గాలను గాలికి వదిలేసి.. ఉన్న చార్జీలను పెంచే ప్రయత్నం చేశారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి రియల్ ఏస్టేట్ రంగానికి గుదిబండగా మారిన నాలా సమస్యను పరిష్కరించాలి.

- ఎం.ప్రేమ్‌కుమార్,
వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్

ఏఎఫ్‌సీఎస్‌పై నిరాధార ఆరోపణలు: టీజీఎస్‌ఆర్టీసీ

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం(ఏఎఫ్‌సీఎస్)పై నిరాధార ఆరోపణలు తగదని టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకే ఏఎఫ్‌సీఎస్‌ను అమలు చేస్తున్నట్లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. డిజిటల్ టికెటింగ్ కోసం సాంకేతికను అందిపుచ్చుకునేందుకు కేంద్రం రూ.20.97 కోట్లను విడుదల చేసిందని పేర్కొన్నారు. ఏఎఫ్‌సీఎస్ కోసం 2022 నవంబరు 2న టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఇంటెలిజెంట్ టికెట్ యంత్రాల సరఫరా, డిజిటల్ టికెటింగ్, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, నిర్వహణకు కావాల్సిన సర్వర్లు, మ్యాన్‌పవర్‌పై 'ఛలో మొబిలిటీ'కి బాధ్యతలను అప్పగించాలని కమిటీ ప్రతిపాదించినట్లు వివరించారు. బస్సుల్లో యూపీఐ, డెబిట్/క్రెడిట్ కార్డులతో డిజిటల్ పేమెంట్స్, స్మార్ట్‌కార్డ్స్, మొబైల్ టికెట్స్, మొబైల్ బస్‌పాస్ సౌకర్యం కల్పించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుకు మహిళలకు స్మార్ట్‌కార్డ్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు ఛలో మొబిలిటీ అనుభవం ఉపయోగపడుతుందని గుర్తించామన్నారు. దాంతో మార్చి 15న ఛలో మొబిలిటీకి లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్ఓఐ) ఇచ్చామని తెలిపారు. కొన్ని డిపోల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తామని, అన్ని డిపోల్లో అమలుకు మూడు నెలల సమయం పడుతుందని వివరించారు. అసోం, బీహార్ రాష్ట్రాలతోపాటు.. ముంబై, ఇండోర్, జబల్‌పూర్ నగరాల్లో ఈ వ్యవస్థ కొనసాగుతోందని, ఒక్క ముంబైలోనే ఛలో మొబిలిటీ ద్వారా 11 లక్షల స్మార్ట్‌లు జారీ అయ్యాయని పేర్కొన్నారు.

సైబర్ బాధితులకు రూ.31.29 కోట్లు రికవరీ

- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.31.29 కోట్ల సొమ్మును రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్ఎల్ఎస్ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా తీసుకున్న చర్యల వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీ నుంచి జూన్ 8 వ తేదీ వరకు రెండు లోక్‌అదాలత్‌లతో కలిపి రూ.31.29 కోట్లు రికవరీ చేసినట్లు ఆయన వివరించారు. సైబర్ మోసాలకు సంబంధించి నాలుగునెలల్లోనే కోర్టులో 5,142 పిటిషన్లు నమోదు అయ్యాయని తెలిపారు. సైబర్ నేరాలపై టీజీసీఎస్‌బీ తక్షణమే స్పందిస్తూ బాధితుల సొమ్మును సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా చర్యలు తీసుకుంటున్నదని శిఖాగోయల్ చెప్పారు. సైబర్‌నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేస్తున్నప్పటికీ బాధితులకు తిరిగి అందించడంలో ఆలస్యం అవుతోందని ఆయన అన్నారు. ఇలాంటి కేసులను సీఆర్‌పీసీ సెక్షన్ 457 కింద నమోదు చేయడంతో పాటు దర్యాప్తునకు సంబంధించి స్టాండర్డ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)లను తయారు చేసి అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలకు పంపినట్లు శిఖాగోయల్ తెలిపారు.

యువకుడి ఉసురుతీసిన.. ఆన్‌లైన్ బెట్టింగ్

- 3 రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రిలో ఆదివారం మృతి



భాను(ఫైల్)

రామాయంపేట, జూన్ 16: ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ యువకుడి ప్రాణాలు తీసింది. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం ధర్మారం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దొమ్మాట భాను(24) డిగ్రీ పూర్తి చేసి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి రూ.2 లక్షల దాకా నష్టపోయాడు. దీంతో మనస్తాపం చెంది మూడు రోజుల క్రితం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబీకులు వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ తెలిపారు.

164 కిలోల గంజాయి, 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు సీజ్

- వేర్వేరు కేసుల్లో ఏడుగురి అరెస్టు

హైదరాబాద్ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఒడిసా నుంచి హైదరాబాద్‌కు గుట్టుగా గంజాయి తరలిస్తున్న రెండు అంతర్రాష్ట్ర ముఠాలకు చెందిన ఆరుగురిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 164 కిలోల గంజాయి, మూడు కార్లు, ఓ బైక్, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మి పెరుమాళ్ సీసీఎస్‌లో ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మొత్తంలో గంజాయి దిగుమతి అవుతుందనే సమాచారంతో దాడి చేసిన పోలీసులు ఓ ముఠాను పట్టుకుని వారి వద్ద వంద కిలోల గంజాయిని సీజ్ చేశారు. కామారెడ్డి జిల్లా పిట్లాంకు చెందిన ధారావత్ రవి, మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన సయ్యద్ బహదూర్, ఆనంద్ రామ్‌జీ కదమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ప్రధాన నిందితుడు ధారావత్ రవి ఇటీవల ఒడిశా వెళ్లి అక్కడ ఓ రైతు దగ్గర 100 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దానిని 32 ప్యాకెట్లుగా మార్చి బహదూర్, ఆనంద్ రామ్‌జీ సహకారంతో కారులో హైదరాబాద్‌కి తరలించి పోలీసులకు పట్టుబడ్డాడు. మరో కేసులో ఇదే తరహాలో ఒడిసా నుంచి నగరానికి గంజాయి తీసుకొచ్చిన హైదరాబాద్‌కు చెందిన షేక్ సర్వేజ్, అబ్దుల్ రవూఫ్, మహ్మద్ అన్వర్ అరెస్టయ్యారు. వారి నుంచి 64 కిలోల గంజాయిని సీజ్ చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ పర్వేజ్ గతంలో రాజమండ్రి జైలులో శిక్ష అనుభవించాడు. ఇటీవల బయటికొచ్చిన పర్వేజ్ ఒడిసా వెళ్లి జైలులో అతనికి పరిచయమైన గంజాయి రైతు దీపక్‌ను కలిశాడు. దీపక్ నుంచి 64 కిలోల గంజాయి తీసుకుని రవూఫ్, అన్వర్‌తో కలిసి హైదరాబాద్‌కు తీసుకొచ్చి పోలీసులకు చిక్కాడు. మరో కేసులో యూపీ నుంచి హైదరాబాద్‌కు గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని శేరిలింగంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ పరిధిలో పార్టీలు, ఈవెంట్లలో తనిఖీలు చేసిన ఎక్సైజ్ పోలీసులు 8 మత్తు పదార్థాల ప్యాకెట్లను సీజ్ చేశారు.



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్, ఏసీపీ శ్రీనివాసరావు

జిల్లా ఎస్పీకి ప్రశంసా పత్రం



జిల్లా ఎస్పీకి ప్రశంసా పత్రం అందిస్తున్న స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ, సిబ్బంది

ఆదిలాబాద్‌అర్బన్,జూన్16: పార్లమెంట్ ఎన్నికలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి కృషి చేసిన జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ఐపీఎస్‌కు కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్‌కుమార్‌ప్రశంసా పత్రం అందజేశారు.కాగా జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం, సిబ్బంది ఎన్నికల విధులను నిర్వర్తించేలా ప్రణాళికలు చేయడం, ప్రజలలో ఓటింగ్ పైఅవగాహన కల్పించి ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తూ ఎన్నికలను నిష్పక్ష పాతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అదే విధంగా ఎన్నికల సామాగ్రి, ఈవీఎంల భద్రత ఉన్నతమైన పనితనాన్ని అభినందిస్తూ ఈప్రశంస పత్రాన్ని అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈసందర్భంగా ఆదివారం జిల్లా ఎస్పీక్యాంపు కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్ జిల్లా ఎస్పీకి శాలువాతో సన్మానించి సిబ్బందితో కలిసి ప్రశంసా పత్రాన్ని జిల్లా ఎస్పీకి అందించారు.అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన జిల్లా పోలీసులందరికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ సీసీ దుర్గం శ్రీనివాస్, రిజర్వ్‌ఇన్‌స్పెక్టర్ నవీన్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై అన్వర్‌ఉల్‌హక్, ప్రజాఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది సైబర్ సెల్ హెడ్ కానిస్టేబుల్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది, తదితరులున్నారు.

అమన్ ఫౌండేషన్‌కు అవార్డు

ఆదిలాబాద్ రూరల్, జూన్ 16: హైదరాబాద్ త్యాగరాజ సంగీత సభ హాల్‌లో సత్య సంగీత ఇంటర్నేషనల్ సేవా సాంస్కృతిక ఫౌండేషన్, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సహకారంతో తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వివిధ సామాజిక సేవ సంస్థల ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నటువంటి సంస్థల నుంచి ఆదిలాబాద్ అమన్ ఫౌండేషన్‌కి అవార్డు ప్రదానం చేశారు. అమన్ ఫౌండేషన్ అధ్యక్షుడు అరాఫత్ ఖాన్‌కి, వైస్ ప్రెసిడెంట్ పరమేశ్వర్‌కి ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, బీసీ కమిషన్ చైర్మన్ వకుళభరణం కృష్ణ మోహన్, డీసీసీ అధ్యక్షుడు కొమరాన్న, అడ్వకేట్ సెంగెం సుధీర్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేశారు. అమన్ ఫౌండేషన్ అధ్యక్షుడు అరాఫత్ ఖాన్ మాట్లాడుతూ అవార్డు రావడం చాలా సంతోషకరమైన విషయం, యువతకి ఇలాంటి అవార్డు ఇవ్వడం వల్ల యువత ముందుకు వచ్చి మరింత సేవ చేయగలుగుతారన్నారు. కార్యక్రమంలో సభ అధ్యక్షులు ఓంకార్ రాజు పాల్గొన్నారు.

'గోవధను అరికట్టాలి'

తలమడుగు, జూన్ 16: రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశం ప్రకారం బక్రీద్ పండుగకు గోవధను అరికట్టాలని తలమడుగు పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం మండల బీజేపీ నాయకులు మాట్లాడుతూ బక్రీద్ పండుగకు గోవధ జరుగుతుందని, వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం వారు ఇటీవలే శాసన సభ్యులు రాజాసింగ్ వేసిన పిటిషన్ పరిశీలించి బక్రీద్ పండుగకు గోవధ మరియు, గోవుల అక్రమ రవాణ జరగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు దాతజీ కిరణ్, పోట్టిపెల్లి శ్రీనివాస్, గోడం భుజంగ్‌రావు పాల్గొన్నారు.

'దుండగుడిని కఠినంగా శిక్షించాలి'

ఆదిలాబాద్‌రూరల్, జూన్ 16: బాలికపై అత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని పీఓడబ్ల్యూ జిల్లా కన్వీనర్ దుర్గం కళావతి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఆమె మాట్లాడారు. పెద్దపల్లి జిల్లాలో చిన్నారిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనపై సమగ్రమైన దర్యాప్తు జరిపించాలన్నారు. నింతున్ని చట్ట ప్రకారంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం సభ్యులు గంగమ్మ, వర్ష, తార సునీత పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే వెడ్మబొజ్జు జన్మదిన వేడుకలు



ఉట్నూర్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉట్నూర్,జూన్16:ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు జన్మదిన వేడుకలు ఖానాపూర్ నియోజక వర్గంలో ఆదివారం ఘనంగా జరిగాయి. నియోజక వర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజలు ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదివారం ఎమ్మెల్యే వెడ్మబొజ్జుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ..లేఖ విడుదల చేశారు. జన్మదినం సందర్భంగా హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలుపుతు ప్రజాసేవలో నిమగ్నమై, రాష్ట్రంలో ప్రజాపాలనలో భాగస్వామ్యం కావడానికి భగవంతుడు మీకు సంపూర్ణ ఆయురారోగ్యం ప్రసాదించాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నట్లు సీఎం లేఖలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలపడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కృతజ్ఞతలు తెలిపారు.ఇదిలా ఉండగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అభిమానులు ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇదేకాకుండా ఉట్నూర్ పట్టణంలోని జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వెడ్మబొజ్జుపటేల్ యువసేన, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బొజ్జు పటేల్ యువసేన కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఖానాపూర్ నియోజక వర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యేబొజ్జుపటేల్ పని చేస్తున్నారని అన్నారు. పేదబడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తున్నారని పేర్కొన్నారు ఓపేద కుటుంబం నుంచి వచ్చిన ఆయన ఈ ప్రాంతానికి భవిష్యత్తులో మరిన్ని సేవలందించాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెడ్మబొజ్జుపటేల్, యువసేన సభ్యులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే బొజ్జుపటేల్ క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేశారు.

ఘనంగా అనిల్‌జాదవ్ జన్మదిన వేడుకలు

నేరడిగొండ,జూన్16: అభివృద్ధి చేసే సత్తా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కే ఉందని పలువురు నాయకులు పేర్కొన్నారు. నేరడిగొండ మం డల కేంద్రంలో ఆదివారం ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ అభివృద్ధి కోసం అనిల్‌జాదవ్ కృషి చేస్తున్నారన్నారు. పలువురు నాయకులు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి జోగురామన్న మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్, జిల్లా నాయకులు జమునా బాయి, నియోజక వర్గ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు రాజురా జగదాంబ ఆలయంలో నేరడిగొండ శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఆశీర్వదించారు. నియోజక వర్గం నుంచి వందల సంఖ్యలో కార్యకర్తలు తరలి రావడంతో మండలంలో సందడి వాతావరణం నెలకొంది. ఇందులో బోథ్ జడ్పీటీసీ సంధ్యారాణి, డాక్టర్ రవికిరణ్‌యాదవ్, బోథ్ ఏఎంసీ మాజీచైర్మన్ సోలంకి రుక్మన్‌సింగ్, నాయకులు నారాయణరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మల్లెపూల సుభాస్, తాహశ్రీర్ బిన్, సదానందం, సురేందర్‌యాదవ్, జాదవ్‌రమేష్, గులాబ్ సింగ్, విలాస్‌పవార్, ప్రతాప్‌సింగ్, పాండురంగ్ ఎంపీపీలు తుల శ్రీనివాస్, రాథోడ్‌సజన్, ప్రీతంరెడ్డి, తిరుమల్‌గౌడ్, ముదిరాజ్ సంఘం నాయకులు శలేందర్ శివయ్య తదితరులున్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బోథ్ ఎంపీపీ

బోథ్: స్థానిక శాసనసభ్యులు అనిల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఎమ్మెల్యేను కలిసి సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి లక్ష్యంగా ప్రజా సేవ పరమావధిగా భావించి ఎమ్మెల్యే నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పాలకొండ ప్రశాంత్, మాజీ సర్పంచ్‌లు బాబుసింగ్, దేవేందర్, రవి, న్యాయవాది వందనం శంకర్, విశ్వేశ్వర్, భీముడు, కిషన్, చంద్రమోహన్ ఉన్నారు.

తలమడుగులో వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

తలమడుగు, జూన్ 16 : మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఆలయ 45వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు ముద్దం ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ తలమడుగు మండల కేంద్రంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించి 45సంవత్సరాలు పూర్తయిందన్నారు. గ్రామంలో ఆలయం నిర్మించిన నాటి నుంచి నేటి వరకు ప్రతీ సంవత్సరం వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామంలో ఆలయ నిర్మాణంతోనే గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు.అనంతరం ఆలయ పూజారి నేరేళ్ల కల్యాణ్‌కుమార్ అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తిరుపతిరెడ్డి, రామ్‌రెడ్డి, పద్మాకర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి,నరేందర్‌రెడ్డి,రమేష్,శ్రీకాంత్,గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పురోహితుడు

నేడు మండలంలో ఎంపీ పర్యటన

తాంసి,జూన్ 16:మండలంలోని ఆయా గ్రామాలలో ఆదివారం ఎం పీ నగేష్ సోమవారం పర్యటించనున్నట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్ రెడ్డి తెలిపారు.ఉదయం 12 గంటలకు మండల కేంద్రంలోని వీడీసీ ఫంక్షన్ హాల్‌లో సన్మాన సభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటా : ఎంపీ


నేరడిగొండ, జూన్16:రాష్ట్ర ప్రభుత్వంతో పనులు చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ గోడంనగేష్ అన్నారు.ఆదివారం మండలంలో విజ యోత్సవ కార్యక్ర మంలో పాల్గొనగా బీజేపీ కార్యకర్తలు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తనపై నమ్మకంతో గెలిపించి నందుకు ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మాణం, ఎరోడ్రమ్ నిర్మాణంతో పాటు జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ పనులను త్వరలోనే పూర్తి చేయిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం,జడ్పీటీసీ తాటిపెల్లి రాజు,మండల అధ్యక్షుడు సంతోష్‌సింగ్, శంకర్, నరేందర్, మహేందర్‌రెడ్డి, రమేష్, తదితరులున్నారు.

ఆదిలాబాద్ పట్టణంలో బక్రీద్ సందడి

ఆదిలాబాద్‌అర్బన్,జూన్16: పట్టణంలో సండే బజార్ సందడిగా మారింది. బక్రీద్ పండుగతో పాటు ప్రతీ ఆదివారం మార్కెట్‌కు వచ్చే కొనుగోలు దారులతో మార్కెట్ కళకళలాడింది. మహిళలు పండుగకు కావాల్సిన సామగ్రితో పాటు పిల్లలకు బట్టలు ఇతరాత్ర వస్తువులను కొనుగోలు చేశారు. ప్రతి ఆదివారం నిర్వహించే సండే బజార్‌కు సోమవారం బక్రీద్ పండుగ ఉండడంతో మరింత గిరాకి పెరిగింది.

అంగరంగ వైభవంగా ఆలయ వార్షికోత్సవం

తాంసి, జూన్ 16: మండలంలోని పొన్నారి గ్రామంలో శ్రీమహాలక్ష్మీ ఆరవ ఆలయ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా చేపట్టారు. ఆదివారం అమ్మ వారికి అభిషేకాలు చేసి, వేద పండితుల మంత్రోచ్చారణలతో పూజలు నిర్వ హించారు. కార్యక్రమంలో ఎంపీపీ సూరకుంటి మంజుల, వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ రఘు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కన్నాజీ నర్సింగ్‌చారి, గణేష్, విఠల్, లక్ష్మీనారాయణ, నాయకులు లింగారెడ్డి, లక్ష్మీపతి, పాల్గొన్నారు.



బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

బోథ్, జూన్ 16: బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బోథ్ ఎస్సై బి.రాము కోరారు. ఆదివారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగను ప్రభుత్వ నిబంధనలకు లోబడి జరుపుకోవాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించవద్దని సూచించారు. సమావేశంలో పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బదిలీలు.. అయ్యేనా?



ఉట్నూర్‌లోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాల

- బదిలీల ఉత్తర్వులు రాక గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల ఆందోళన
- 13 ఏళ్లుగా ఒక చోట విధులు

ఉట్నూర్, జూన్ 15: గత సంవత్సరం అక్టోబరు, నవంబరు నెలలో విద్యాశాఖ, పంచాయతీరాజ్ శాఖల్లో పని చేస్తున్న అన్ని క్యాడర్ల ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు నిర్వహించిన ప్రభుత్వం గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు మోసం చేసిందని, ఈ సారి కూడా బదిలీలు పదోన్నతులు చేపడుతున్నా మరోసారి ప్రభుత్వం గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు బదిలీలను చేస్తుందో లేదోనని గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల కొన్ని క్యాడర్లకు ఎన్నికల కోడ్ ముగియడంతో బదిలీ ప్రక్రియ కొనసాగిస్తుందని ఈ ప్రక్రియ జూన్ 30, 2024కు పూర్తికానుండగా గిరిజన సంక్షేమ శాఖలో విభిన్న పరిస్థితి నెలకొందని విచారం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం అక్టోబరు, నవంబరు నెలలో బదిలీలు, పదోన్నతులు చేయమంటే గవర్నమెంట్ ప్లీడర్ సలహా కావాలని రెండు నెలలుగా ఉపాధ్యాయులను గిరిజన సంక్షేమ అధికారులు మోసం చేశారని, ఈ సారి ఎన్నికల కోడ్ ముగియగానే విద్యాశాఖ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, కమిషనర్ దేవసేన వెంటనే ముఖ్యమంత్రి వద్ద నుంచి అనుమతి తీసుకొని రెండవ సారి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించి మల్టీజోన్ 1, 2 ఉపాధ్యాయులకు ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ చేస్తున్నారన్నారు.

బదిలీలు చేపట్టాలి

ఈ సారి ప్రధానోపాధ్యాయుల నియామకం విషయంలో శాఖ మంత్రి అనుమతి కావాలని చెబున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు సీఎం పేషీకి వెళ్లి ఫైల్ తెచ్చుకొని ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతి ప్రక్రియ చేపట్టి నప్పుడు గిరిజన సంక్షేమ సెక్రెటరీ శరత్, డైరెక్టర్ ఈవీ నర్సింహా రెడ్డిలు కూడా ఫైలును తెచ్చి పదోన్నతులు, బదిలీలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. గత 13 సంవత్సరాల నుంచి ఒకే స్థానంలో చాలా మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ సారైనా బదిలీలు చేపట్టాలని అధికారులను ఉపాధ్యాయులు కోరుతున్నారు. వార్డెన్, ఏటీడీవో, డీటీడీవో నియామకపు అధికారి ఉత్తర్వులను ఎప్పుడో తెచ్చుకున్న వారు ఉపాధ్యాయుల విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. గిరిజన సంక్షేమ విద్య అంటే బియ్యం, పప్పుల లెక్కలు చూసే అధికారులు మాత్రమే ఉద్యోగులుగా, పాఠాలు చెప్పే ఉపాధ్యాయులను రెండవ శ్రేణి పౌరులుగా పరిగణించే వ్యవస్థగా మారుస్తున్నారని విచారం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైన చొరవ తీసుకొని బదిలీలను చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇప్పటికే మార్చబడిన, ఉన్నతీకరించిన పాఠశాలల్లో 1191 పోస్టు, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా 601, మైదాన ప్రాంత పాఠశాలల్లో 339 పోస్టులు మంజూరు చేయవల్సి ఉందని, అలాగే ఒక డీఎడ్ కళాశాల, రెండు ఎడ్‌బీఎడ్ కళాశాలలో, ఐదు జూనియర్ కళాశాలల్లో పోస్టులు మంజూరు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైన ఉందన్నారు.

నాలుగు పీఈటీసీ లల్లో పోస్టు భర్తీ చేసి పోటీ పరీక్షలల్లో పాల్గొనే గిరిజన యువకులకు న్యాయం చేయాలని ఉద్యమాలు కూడా చేశామని గుర్తు చేశారు. స్వర్గీయ ఎస్ఆర్ శంకరన్ అనే ఒక ఐఏఎస్ అధికారి 1974లో ఏ లక్ష్యంతో ఆశ్రమ పాఠశాలలు ప్రారంభించారో, స్వర్గీయ ఎన్టీ రామారావు 1987లో ఒకేసారి 4,500 పోస్టులు గిరిజన సంక్షేమ శాఖకు కేటాయించి నిరుద్యోగ గిరిజన యువకుల జీవితాల్లో వెలుగు నింపారో.. స్వర్గీయ వైస్ రాజశేఖరరెడ్డి గిరిజనుల కోసం బీఎడ్ కళాశాలలు నెలకొల్పారో అలాగే ఎందరో అధికారులు, నాయకులు చేసిన తపస్సును ఈ గిరిజన సంక్షేమ అధికారులు బూడిదలో పన్నీరు పోస్తున్నారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా వాస్తవిక దృష్టి కోణంలో ఆలోచించి గిరిజన సంక్షేమ విద్యకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరుకుంటున్నారు. లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు.

త్వరలో బదిలీలు, పదోన్నతుల ఉత్తర్వులు



- దిలీప్‌కుమార్, డీడీటీడబ్ల్యు

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల ఉత్తర్వులు త్వరలో వస్తాయి. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ఉత్తర్వులు రాగానే బదిలీలు పదోన్నతుల ప్రక్రియ చేపడతాం.

బదిలీలు చేపట్టకుంటే ఆందోళనలు చేస్తాం



- ముడుగు శామ్యూల్, డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు సకాలంలో చేపట్టకుంటే ఆందోళనలు చేస్తాం. ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల బదిలీలు వెంటనే చేపట్టాలి.

వివక్ష చూపించొద్దు



- దీవీరావు, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల విషయంలో ప్రభుత్వం వివక్ష చూయించవద్దు, బదిలీల ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి.

ఏజెన్సీ గిరిజనేతరుల రైతులకు పహాణి పత్రాలు ఇవ్వాలి

ఉట్నూర్, జూన్16: ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో జీవిస్తున్న గిరిజనేతర రైతులకు ప్రభుత్వం పహాని పత్రాలు ఇవ్వాలని గిరిజనేతరుల సంక్షేమ సంఘం ఉట్నూర్ మండల అధ్యక్షుడు దావుల రమేష్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌కు వినతిపత్రం అందజేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఏజెన్సీలో ఉంటున్న గిరిజనేతరులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు స్థానికసంస్థల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించేలా చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల గిరిజన ఎమ్మెల్యేలతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రిమ్స్‌లో కొత్త కాంట్రాక్టర్లను నియమించాలని వినతి

ఆదిలాబాద్ రూరల్, జూన్16: జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో కొన్నేళ్లుగా కొనసాగుతున్న కాంట్రాక్టర్లను కాకుండా కొత్త వారిని నియమించాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కోరారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఆదివారం మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. రిమ్స్‌లో కృష్ణ కన్‌స్ట్రక్షన్స్, మహాలక్ష్మి మాన్ పవర్ ఏజెన్సీ కాంట్రాక్టర్లు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

'మాలీలకు ఎస్టీ హోదా ఇప్పించాలి'

ఆదిలాబాద్ రూరల్, జూన్ 16: తెలంగాణ అసెంబ్లీలో మాలీల ఎస్టీ హోదా బిల్లు పాసై కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు కృషి చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేష్‌ని మాలీ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే, రాష్ట్ర కోశాధికారి సతీష్ కోరారు. జిల్లాకేంద్రంలోని ఎంపీ నివాసంలో ఎంపీ నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంపీగా ఎన్నికైనందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే బోర్డు సభ్యులు జివి రమణ, మరాఠా సంఘం నాయకులు బోయర్ ప్రశాంత్, బోయర్ విజయ్ పాల్గొన్నారు.

పొచ్చెర గ్రామంలో ప్రత్యేక పూజలు

బోథ్, జూన్16: మండలంలోని పొచ్చెర గ్రామంలో ఆదివారం గ్రామ దేవతలకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా పెద్దమ్మతల్లికి భీమన్న దేవునికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పంటలు బాగా పండాలని మొక్కులు చెల్లించారు.



పూజలు చేస్తున్న ముదిరాజ్ కులస్తులు

మతసామరస్యాన్ని కాపాడుతూ బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

- జిల్లా ఎస్పీ గౌస్ ఆలం
- బక్రీద్ పండుగకు భారీ బందోబస్తు

ఆదిలాబాద్‌అర్బన్, జూన్16: బక్రీద్ పండుగను జిల్లా ప్రజలు మత సామరస్యాన్ని కాపాడుతూ ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ గౌస్‌ఆలం కోరారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఏర్పాటుచేసిన బందోబస్తు, నిర్వహించే అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా గత 20 రోజులుగా ఆరు అంతరాష్ట్ర, ఆరు అంతర జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ప్రతీ చెక్‌పోస్టు వద్ద ఐదుగురు సిబ్బందిని ఏర్పాటు చేశామని వెల్లడించారు. 24గంటలు వాహనాల తనిఖీలు చేపట్టి ఆవుల అక్రమ రవాణా జరుగకుండా విధులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్, ఇచ్చోడ, ఉట్నూర్ మూడు ప్రధాన పట్టణాల్లో ఆకస్మిక తనిఖీలను నిర్వహిస్తూ అక్రమ రవాణా జరుగకుండా కాపాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలో, జిల్లావ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు సామాజిక మాధ్యమాలలో వచ్చే వదంతులను నమ్మవద్దని, ఎటువంటి సమాచారమైన డయల్ 100 లేదా సంబంధిత పోలీసు స్టేషన్లకు సంప్రదించాలన్నారు. ఇందులో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి, సీహెచ్ నాగేందర్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ గౌస్‌ఆలం

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 16: రాష్ట్రవ్యాప్తంగా సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, సాగుచేస్తున్న వారిపై అటవీ అధికారులు దాడులు ఆపాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్‌చేశారు. ఆదివారం సుందరయ్య భవనంలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆత్రంభగవంత్ 4వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, నాయకులు లంక రాఘవులతో కలిసి భగవంత్‌రావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆదివాసుల హక్కుల కోసం ఆత్రంభగవంత్‌రావు చేసిన పోరాటాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పోడు పట్టాలను కొంతమందికే ఇచ్చిందని మిగితా వారికి ఇవ్వలేదన్నారు. దానికారణంగా అటవీ అధికారులు హరితహారం పేరిట భూములను లాక్కోవాలని చూస్తు ఆదివాసులపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీ ఇచ్చి విస్మరిస్తుందని ఆరోపించారు. ఆదివాసీల హక్కుల కోసం భగవంత్‌రావ్ ఉద్యమించారని, కోలం తెగలో పుట్టిన ఆయన ఆదివాసీల సమస్యలు, చట్టాలు, హక్కులు, సంఘం సిద్ధాంతాలుతెలిసిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తితో పోడు పట్టాల సాధనకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.ఇందులో టీఏజీఎస్‌జిల్లా అధ్యక్షుడు ఉయికవిష్ణు, రాష్ట్ర నాయకులు భీంరావ్, జిల్లా నాయకులు మేస్రం మహేశ్, సునిల్, సీఐటీయూ కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నేరడిగొండ, జూన్16: మండలంలోని శంకరపూర్ గ్రామానికి చెందిన జాదవ్ రాజేశ్వర్ మృతిచెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడేగజేందర్ పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట బోథ్ బ్లాక్ ప్రెసిడెంట్ ప్రఫుల్‌రెడ్డి, బోథ్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ప్రెసిడెంట్ బద్దంపోతారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజురెడ్డి, శంకర్, కపిల్ తదితరులున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం కృషి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్



మాట్లాడుతున్న నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, జూన్16: నాల్గో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ అన్నారు. ఆదివారం సంఘభవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సంఘం సభ్యులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు 20వ తేదీ వరకు వేతనాలు వచ్చేవని, కాంగ్రెస్ హయాంలో ప్రతీనెల 5వ తేదీ లోపు వేతనాలు వస్తున్నాయన్నారు. ఏపీలో ఉన్న ఉద్యోగులను తెలంగాణలో తీసుకోవాలని విన్నవించగా స్పంది ంచి ఫైలును పంపించారన్నారు. పదేండ్లుగా ఏపీలో నాల్గో తరగతి ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని, వారిని తెలంగాణకు తీసుకురావాలని విన్నవించిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారన్నారు. అలాగే పార్ట్‌టైమర్, ఏఎన్‌ఎం, డెయిలీ వైజ్ వారికి రూ.30వేల నుంచి ఇవ్వాలని పీఆర్సీ కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. ఇందులో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజుల సంక్షేమానికి కృషి: ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌అర్బన్, జూన్16: ముదిరాజ్ సామాజికవర్గం ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలను పరిష్కరించి వారి అభివృద్ధి కోసం తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. ఆదివారం పట్టణ ముదిరాజ్ సంఘ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి వారి సమస్యలను వివరించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పట్టణంలో ముదిరాజ్ సంఘం భవన నిర్మాణం, భీమన్న దేవాలయం అభి వృద్ధి కోసం కృషిచేస్తానని హామీఇచ్చారు. ఇందులో సంఘం సభ్యులు తదితరులున్నారు.

ఇసుక లారీని అడ్డుకున్న స్థానికులు

- పోలీసులకు ఫిర్యాదు

బోథ్, జూన్ 16 : మండల కేంద్రానికి సమీపంలో పొచ్చెర క్రాస్ రోడ్డు సమీపంలోని పెట్రోల్ బంక్ పక్కన ఖాళీ స్థలంలో ఇసుక లారీని స్థానికులు అడ్డుకున్నారు. ఎలాంటి బిల్లులు లేకుండా నిర్మల్ నుంచి వచ్చిన లారీని స్థానికులు నిలిపి లారీలో వచ్చిన ఇసుకకు సంబంధించిన పత్రాలను చూపించాలని డ్రైవర్‌ను అడిగారు. డ్రైవర్ వద్ద ఎలాంటి ఇసుకకు సంబంధించి పత్రాలు లేకపోవడంతో స్థానిక పోలీసులకు పిర్యాదు చేశారు. లారీలో తీసుకువచ్చిన ఇసుక ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీ చెల్లించకుండానే తీసుకువచ్చారన్న అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు. దీంతో పోలీసులు లారీకి సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. గత కొన్ని రోజులుగా జీరోలో ఇసుకను నిర్మల్ నుంచి కొంత మంది లారీ యజమానులు తీసుకువస్తున్నారని స్థానిక ప్రజలు అంటున్నారు.



సగం ఇసుక ఖాళీ చేసి నిలిపి ఉంచిన లారీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నగేష్

జిల్లా అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు తెస్తా

- ఎంపీ జి. నగేష్

బోథ్, జూన్ 16: ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా తనకున్న అనుభవంతో జిల్లా అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులను తెస్తానని ఆదిలాబాద్ ఎంపీ జి.నగేష్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు ఈసారి ఎన్నికల్లో విలక్షణమైన తీర్పు ఇచ్చారని, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఓటర్లను ఆకట్టుకునేందుకు ఎన్నోరకాల ప్రలోభాలకు గురిచేసినా జిల్లాప్రజలు మాత్రం నరేంద్ర మోదీపై అభిమానం, నాపై ఉన్న నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారని ఎంపీ జి.నగేష్ పేర్కొన్నారు. ఆదివారం మండలకేంద్రం సమీపంలోని పొచ్చెర ఫంక్షన్‌హాల్‌లో జరిగిన విజయోత్సవ అభినందన సభలో పాల్గొని ప్రసంగించారు. ఆదిలాబాద్ జిల్లాప్రజలు కేంద్రంలో భారతీయ జనతా పార్టీపై ఉన్న నమ్మకాన్ని మరోసారి రుజువు చేయడం జరిగిందన్నారు. తాను నాలుగుసార్లు శాసనసభకు, మూడుసార్లు పార్లమెంట్‌కు పోటీచేయడం జరిగిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా తనకున్న అనుభవంతో జిల్లాఅభివృద్ధి కోసం కేంద్రప్రభుత్వం నిధులను తీసుకురావడం జరుగుతుందని అన్నారు. అత్యధిక నిధులను ఈసారి జిల్లాకు తీసుకువచ్చి అభివృద్ధిని చేసి చూపిస్తానని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లనుపలు రకాలుగా తప్పుడు ప్రచారాలతో తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నించారన్నారు. బీజేపీ గెలిస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వరని కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమ పథకాల అమలు చేయడం సాధ్యమవుతుందని ప్రచారం చేశారన్నారు.


- స్థానిక పోరుకు సిద్ధంగా ఉండండి..

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఎంపీ సూచించారు. జిల్లా అభివృద్ధికి ఎంపీగా నిధులు తీసుకువస్తానని ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు. తాను అభివృద్ధికి కట్టుబడి ఉంటే కార్యకర్తలు మాత్రం బీజేపీ అభ్యర్థులు గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్ జిల్లా నాయకులు దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యులు జి.వి.రమణ, జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు, మండల పార్టీ కన్వీనర్ బోరే రవీందర్, సహకార సంఘం చైర్మన్ కదం ప్రశాంత్, గడ్డం భీమ్‌రెడ్డి, సీనియర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాదిగూడలో గాలివాన బీభత్సం

- నేలకొరిగిన విద్యుత్ స్తంభం

ఇచ్చోడ, జూన్ 16: ఇచ్చోడ మండలం బాదిగూడ గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులతో కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభం నేలకొరిగింది. విద్యుత్ తీగలు రోడ్డుపై నేలకొరిగే సరికి విద్యుత్ సరఫరా అయ్యే బాదిగూడ తుమ్మలపాడ్, లచ్చంపూర్, గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. సంబంధిత అధికారులు వెంటనే చొరవ తీసుకొని విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలని గిరిజన గ్రామస్థులు కోరుతున్నారు.



బాదిగూడ గ్రామ శివారులో నేలకొరిగిన విద్యుత్ స్తంభం